సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 28 । అక్టోబర్ । 2023



**వంద రోజుల పని కల్పించాలి**
ఉపాధి కూలీలందరికీ వందరోజుల పనిదినాలు కల్పించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. 8లో



**టేకు దుంగలు పట్టివేత**
వీరవరం వద్ద రవాణాకు సిద్ధం చేసిన 24 టేకు దుంగలను అడ్డతీగల అటవీ రేంజి అధికారులు సీజ్ చేశారు. 8లో



**కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం**
విశాఖలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### త్వరితగతిన పోలీసుస్టేషన్ల భవన నిర్మాణాలు

- ఎస్పీ తుహిన్ సిన్హా
- కొత్త భవనాలకు శంకుస్థాపన



ఎటపాకలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

**చింతూరు:** పోలీసుస్టేషన్ల భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. శుక్రవారం జిల్లాలో నూతన పోలీసుస్టేషన్ల భవన నిర్మాణాలకు ఎస్పీ తుహిన్ సిన్హా, రంపచోడవరం ఓఎస్డీ, చింతూరు అదనపు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎటపాక, కోతులగుట్టలో కూనవరం, రేఖపల్లిలో వీఆర్‌పురం పోలీసుస్టేషన్ల భవనాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒకొక్క పోలీసుస్టేషన్ భవన నిర్మాణానికి రూ.2.4 కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. భూమిపూజ చేసిన భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ బోర్డు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐలు పార్థసారథి, వెంకటేష్ పాల్గొన్నారు.

### కాఫీ కొనుగోలు ధరలు ఖరారు

- జీసీసీ బ్రాంచ్ మేనేజర్ కొండన్న

**జి.మాడుగుల:** గిరిజన సహకార సంస్థ 2023–24కు సంబంధించి కాఫీ కొనుగోళ్లకు అఫెక్స్ కమిటీ ధరలను నిర్ణయించినట్టు జి.మాడుగుల జీపీసీఎంఎస్ బ్రాంచి మేనేజర్ కొండన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ.280, అరబికా చెర్రీ కిలో రూ.145 రొబస్టా చెర్రీ కిలో రూ.70 ప్రకటించినట్టు ఆయన తెలిపారు. మండలంలో డీఆర్ డిపోల్లో సేల్స్‌మేన్లు కాఫీ ధరల పట్టిక ఏర్పాటుచేయాలని ఆదేశించినట్టు ఆయన తెలిపారు. కాఫీ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జీసీసీకి విక్రయించి ఆర్థికంగా లబ్ధిపొందాలని ఆయన కోరారు.

### రంపచోడవరంలో ఆధునిక వైద్యసేవలు

- ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల శస్త్ర చికిత్సలు



శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

**రంపచోడవరం :** స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆధునిక వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలో మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నందున అన్ని రకాల శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. శుక్రవారం ఎక్యూట్ అపెండిసైటిస్ రోగికి జనరల్ సర్జన్ డాక్టర్ సౌజన్య శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. శస్త్రచికిత్స చేసిన వైద్యులు, సిబ్బందిని ఆమె అభినందించారు.

### ఏఎస్పీ ధీరజ్‌కు సత్కారం



ఏఎస్పీ ధీరజ్‌ను సత్కరిస్తున్న తిలక్

**సాక్షి,పాడేరు:** పాడేరు ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ధీరజ్‌ను జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ దక్షిణ భారత కో ఆర్డినేటర్ ఎం.వి.ఎస్.జి.తిలక్ శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన ధీరజ్ అతి చిన్నవయసులోనే ఐపీఎస్ సాధించి అల్లూరి జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు గర్వకారణమన్నారు. ఐపీఎస్ అధికారి ధీరజ్ తండ్రి కేవీ రమణ పోలీసు అధికారిగా పనిచేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో ఐపీఎస్ సాధించి పోలీసు అధికారిగా సేవలు అందించడం అభినందనీయమన్నారు.

# ఈక్రాప్@75,578 హెక్టార్లు

- పూర్తయిన నమోదు
- 16,354 హెక్టార్ల మేర తగ్గిన విస్తీర్ణం
- సాగుపై చింతూరు వరదల ప్రభావం
- పాడేరు, రంపచోడవరం డివిజన్లలో ఆశాజనకం

జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మెరుగైన దిగుబడులు సాధించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చింతూరు డివిజన్‌లో వరదలు సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపాయి. నూనె గింజల సాగు మినహా మిగతా అన్ని రకాల పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పటికే చిరుధాన్యాల పంటల కోత ప్రారంభం కాగా, వరి పైరు కోతలకు సిద్ధమవుతోంది.



ఈ–క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



హుకుంపేట మండలం కొంతిలి ప్రాంతంలో పక్వానికి వచ్చిన వరిపంట

**సాక్షి, పాడేరు :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈక్రాప్ నమోదు పూర్తయింది. జిల్లాలో ఖరీఫ్ పంటల సాధారణ విస్తీర్ణం 91,932 హెక్టార్లు కాగా ఈ ఏడాది 75,578 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటలు వేయగలిగారు. ఈ మేరకు ఈ క్రాప్‌ను నమోదు చేసినట్టు జిల్లా అధికారవర్గాలు తెలిపాయి. వరి 50,430 హెక్టార్లు, రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, జొన్న, మొక్కజొన్న తదితర పంటలను 20,378 హెక్టార్లు, పప్పు జాతులు 411 హెక్టార్లు, నూనె గింజల పంటలు 1714 హెక్టార్లు, పత్తి, చెరకు, పొగాకు తదితర వాణిజ్య పంటలు 2,666 హెక్టార్లలో సాగవుతున్నట్టు ఈక్రాప్ నమోదు ద్వారా వెల్లడైంది.

**దిగుబడి దశలో..**

జిల్లా పంటల సాధారణ విస్తీర్ణం తగ్గినప్పటికీ దిగుబడులు ఆశాజనకంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాగులు, సామలు, కొర్ర పంటలు దిగుబడి దశకు చేరుకున్నాయి. డుంబ్రిగుడ, హుకుంపేట, అరకులోయ, ముంచంగిపుట్టు, అరకులోయ ప్రాంతాల్లో కోతలు ప్రారంభమయ్యాయి.

- వరి పంట కూడా కోత దశకు చేరుకుంది. వరి సాధారణ విస్తీర్ణం 58,404 హెక్టార్లు. అయితే 50,430 మాత్రమే వేశారు. చింతూరు డివిజన్‌లో వరదల కారణంగా ఐదు వేల హెక్టార్లలో రైతులు పంటలు వేయలేకపోయారు.
- చిరుధాన్యాల సాగు విషయానికొస్తే మార్కెటింగ్ ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. సాధారణ విస్తీర్ణం 24,824 హెక్టార్లు. అయితే 20,378 హెక్టార్లలో మాత్రమే వేశారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ప్రతికూల పరిస్థితుల కారణంగా చిరుధాన్యాల సాగు చేపట్టలేకపోయారు.
- పప్పుజాతుల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. సాధారణ విస్తీర్ణం 2,339 హెక్టార్లు కాగా 411 హెక్టార్లలో మాత్రమే వేయగలిగారు.
- నూనెగింజల పంటల సాగు విస్తీర్ణం మాత్రం పెరిగింది. సాధారణ విస్తీర్ణం 1,683 హెక్టార్లు కాగా 1714 హెక్టార్లలో వేశారు.
- పత్తి, చెరకు, పొగాకు తదితర వాణిజ్య పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. సాధారణ విస్తీర్ణం 4,682 హెక్టార్లు కాగా, 2,666 హెక్టార్లలో మాత్రమే సాగు చేపట్టారు.

**పంటల వివరాలు హెక్టార్లలో..**

| | |
|---|---|
| ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం: | 91,932 |
| ఈ ఏడాది సాగు | : 75,578 |
| వరి | : 50,430 |
| చిరుధాన్యాలు | : 20,378 |
| పప్పు జాతులు | : 411 |
| నూనె గింజలు | : 1714 |
| వాణిజ్య పంటలు | : 2,666 |

**పంట నమోదు ఎంతో ఉపయోగకరం**



ఈ క్రాప్ నమోదు వల్ల ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలతోపాటు బీమా సౌకర్యం రైతులకు వర్తిస్తుంది. కొన్ని చోట్ల ఈక్రాప్ నమోదుకు డ్రోన్లు వినియోగించాం. చింతూరు డివిజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గింది,. వరదలు కారణంగా రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో పంటల పరిస్థితి ఆశాజనకంగా ఉంది.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

# ప్రజల చెంతకు సేవలే లక్ష్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- అరకులోయలో 'జగనన్నకు చెబుదాం'కు విశేష స్పందన
- 172 వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**అరకులోయ రూరల్:** ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు అందించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 172 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం ఎంతో ఉపయోగమన్నారు. పంచాయతీ రాజ్, డీఆర్‌డీఏ, గృహనిర్మాణం,ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు చెందిన వినతులు వచ్చాయన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఒకే చోట అనిశాఖల అధికారులు అందుబాటులో ఉన్నందున సమస్యలు సత్వర పరిష్కారం అవుతాయని ప్రజలకు మరింత నమ్మకం కలుగుతుందన్నారు.

అందుకు తగ్గట్టుగా పరిష్కారించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలు పరిష్కరించడంలో తగిన చర్యలు చేపట్టని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తీరు మారకుంటే ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాసు, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ ఉషారాణి పాల్గొన్నారు.

**అర్జీల్లో కొన్ని..**

- పద్మాపురం పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో 78 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నందున అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని వినతిపత్రం అందజేశారు.
- గడబగులుంగులో పాఠశాల భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన రత్నలమ్మ స్వీపర్ పోస్టు ఇవ్వాలని అధికారులను కోరింది.
- ఆధార్ తప్పుగా నమోదైన కారణంగా నిలిపివేసిన పింఛనును పునరుద్ధరించాలని బొండం పంచాయతీ జయంతివలస గ్రామానికి చెందిన కిల్లో మొత్తి వినతిపత్రం అందజేసింది.
- అనంతగిరి మండలం గుమ్మకోటలోని మల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన పట్టా భూమికు ఎన్‌వోసీ ఇవ్వాలని గ్రామస్తులు సింహాచలం,ప్రకాష్ దరఖాస్తు చేశారు.
- ముంచంగిపుట్టు మండలంలో పాత సుజనకోట గ్రామం నుంచి శ్మశాన వాటిక వరకు శాశ్వత రహదారి నిర్మించాలని, తాగునీరు సౌకర్యం కల్పించాలని వినతులు అందాయి.

**సమస్యల పరిష్కారానికి వేదిక**



జగనన్న చెబుదాం కార్యక్రమం సమస్య పరిష్కారానికి మండల స్థాయిలో చక్కని వేదిక. ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది. జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవస్థలు తప్పాయి.

– స్వామి, బస్కి,అరకులోయ మండలం

**ఇబ్బందులు తప్పాయి**



జగనన్న ప్రభుత్వంలో సేవలు గ్రామస్థాయిలోకి అందుబాటులోకి వచ్చాయి. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నారు.

– మోస్య సునీత, మాలిసింగరం, అరకులోయ మండలం

# 1021 పోలింగ్ కేంద్రాలు.. 7,40,573 మంది ఓటర్లు

- ముసాయిదా జాబితాను వెల్లడించిన కలెక్టర్ సుమిత్‌కుమార్
- నియోజకవర్గాల వారీగా ప్రకటన



**సాక్షి,పాడేరు:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. పలు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించిన అనంతరం జిల్లాతో పాటు, నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను వెల్లడించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి 1021 పోలింగ్ కేంద్రాల పరిధిలో 7,40,573 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లాలో అత్యధికంగా మహిళా ఓటర్లు 3,83,611 మంది, పురుషులు 3,56,929 మంది, ఇతరులు 33 మంది ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పరిపాలన అధికారి చిన్నికృష్ణ, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**పాడేరు నియోజకవర్గంలో..**

2,36,232మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో మహిళలు 1,22,071మంది, పురుషులు 1,14,146మంది, ఇతరులు 15 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు.

**అరకు నియోజకవర్గంలో..**

అరకులోయ నియోజకవర్గం పరిధిలో 2,32,337 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో మహిళలు 1,19,243మంది, పురుషులు 1,13,087మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారని కలెక్టర్ వివరించారు.

**రంపచోడవరం నియోజకవర్గంలో**

2,72,004 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,42,297 మంది మహిళలు, 1,29,696 మంది పురుషులు, 11 మంది ఇతరులు ఉన్నారని కలెక్టర్ వివరించారు.

**ఓటు నమోదు, తొలగింపునకు ప్రత్యేక శిబిరాలు**

జిల్లా వ్యాప్తంగా కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులకు సంబంధించి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. వచ్చేనెల 4,5, డిసెంబర్ 4,5 తేదీల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 9వతేదీలోగా అభ్యంతరాలు స్వీకరిస్తామని,వాటిని పరిశీలించిన అనంతరం వచ్చే ఏడాది 2024 జనవరి 5వతేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

# ఓటరు జాబితాల్లో తప్పుల సవరణకు చర్యలు

**రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్**



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

**రంపచోడవరం:** రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో ఓటరు జాబితాల్లో తప్పులు సవరణకు చర్యలు తీసుకున్నామని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,72,004 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఈనెల 20 నుంచి 26 వరకు ఓటు నమోదుకు 34 దరఖాస్తులు, మృతుల పేర్లు తొలగింపునకు 711, తప్పులు, ఫొటోల సవరణకు 50 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఓటర్ల జాబితాల్లో ఏమైనా సమస్యలు ఉంటే సవరణకు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముందు రోజు వరకు ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధానం 79 శాతం మేర పూర్తయిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు నమోదుకు వచ్చే నెల 4,5 తేదీలు, డిసెంబర్‌లో 2,3 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు, కొత్తవి ఏర్పాటు తదితర అంశాలపై లిఖితపూర్వకంగా దరఖాస్తు చేస్తే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు నివేదిస్తామని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

# 61 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన నిందితులతో పోలీసులు

**గూడెంకొత్తవీధి:** సీలేరు టీఆర్‌సీ కేంద్రం వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 61 కిలోల గంజాయి పట్టుబడింది. ముందస్తు సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ వ్యాన్‌లో 61 కిలోల గంజాయి పట్టుబడిందని సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వ్యాన్ డ్రైవర్ అజిత్ సుకదేవ్తోపాటు వ్యాన్‌లో ఉన్న పసుపులంకకు చెందిన పప్పుల ప్రభాకర్‌ను అరెస్టు చేశామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఆయన వెల్లడించారు.

# చరిత్రలో నిలిచిపోయేలా బస్సు యాత్ర



సమావేశానికి హాజరైన పాడేరు నియోజకవర్గ ముఖ్యనేతలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

- విజయవంతంగా నిర్వహించేందుకు కృషి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పాడేరు ఇన్‌చార్జి ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పిలుపు
- ఈనెల 30న పాడేరు నియోజకవర్గంలో నిర్వహణ

**సాక్షి,పాడేరు:** సామాజిక సాధికార బస్సుయాత్ర చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు కృషి చేయాలని బస్సు యాత్ర పాడేరు ఇన్‌చార్జి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పాడేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల సమావేశంలో ఈనెల 30వ తేదీన నిర్వహించే బస్సు యాత్రకు సంబంధించి ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో మేలు పొందిన గిరిజనులంతా ఆయన బిడ్డ జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీ వెంటే ఉండి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్నివర్గాల ప్రజలు తమ పార్టీ వెంటే ఉన్నారన్నారు. ప్రతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వామపక్ష పార్టీలన్నీ ఏకమై అనేక కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరిగానే ధైర్యంగా ఎదుర్కొంటూ పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేదప్రజలకు చేసిన అభివృద్ధిని సమగ్రంగా వివరించే లక్ష్యంగా సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఇచ్ఛాపురంలో బస్సు యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. జనంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయన్నారు. ప్రజల నుంచి స్పందన చూస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్టు 175 సీట్లు గెలవడం ఖాయమన్నారు.

పాడేరు నియోజకవర్గంలో నిర్వహించే బస్సు యాత్ర కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నినాదాలతో దద్దరిల్లాలన్నారు.

**విజయవంతమే లక్ష్యం: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి**

పాడేరు నియోజకవర్గంలో జరిగే సామాజిక,సాధికార బస్సు బస్ యాత్ర విజయవంతానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు,నామినేటెడ్ పదవుల్లో ఉన్న పెద్దలు,పార్టీ నాయకులు,కార్యకర్తలంతా కృషి చేయాలని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు ఎంతో మేలు జరిగిందని,అన్ని సంక్షేమ పథకాలతో లబ్ధి పొందారన్నారు. బస్సు యాత్ర పరిశీలకుడు విష్ణు,పార్టీ వైద్యుల విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తమర్బ నర్సింగరావు, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు,జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఎంపీపీలు ఎస్.రత్నకుమారి, బోయిన కుమారి, కోరాబు అనూషాదేవి, బడుగు రమేష్, జడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, మత్స్యకొండబాబు, బి.లక్ష్మణ్, మోరి రవి, జల్లి బాబులు,మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు,పాస్టర్ల సంఘం అధ్యక్షుడు మోద బాబూరావు,మాజీ ఎంపీపీలు ఎస్.వి.వి.రమణమూర్తి,మత్స్యరాస వెంకటగంగరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మహిళా విభాగం నేతలు పాల్గొన్నారు.

# జగనన్న సురక్షలో 240 వైద్య శిబిరాలు

**డీఎంహెచ్‌వో జమాల్‌బాషా**



**అరకులోయ టౌన్:** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 240 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. శుక్రవారం అరకులోయలో విలేకరులతో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో 297 ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో మరో 57 ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మెరుగైన వైద్యం కోసం నాలుగు వేల మంది రోగులను కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశామన్నారు. జిల్లాలో 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు చొప్పున 124 మంది వైద్యులను నియమించామని, మరో నలుగురు వైద్యులను అదనంగా అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రతీ పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందులు పుష్కలంగా అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

# వరుణ దేవుడా.. కరుణించు



బిందెలతో నీటిని తీసుకెళ్తున్న స్థానికులు

- మల్లికార్జునుడికి జలాభిషేకం
- వెయ్యి బిందెల నీటితో గర్భగుడిని నింపి పూజలు



మల్లికార్జునస్వామి ఆలయంలో నీటితో నింపిన గర్భగుడి

**కొయ్యూరు:** వరుణుడు కరుణించాలని కోరుతూ స్థానిక భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం జలాభిషేకం నిర్వహించారు. గర్భగుడిలోని మల్లికార్జునస్వామి శివలింగాన్ని వెయ్యి బిందెల నీటితో నింపి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఎంవీవీ ప్రసాద్, కొయ్యూరు వైస్ ఎంపీపీ అంబటి నూకరత్నం, మేడిబోయిన చిన్న, సర్పంచ్ మాకాడ బాలరాజు, వాసం రాంబాబు, చీడిపాలెం, కొయ్యూరు, రాజేంద్రపాలెం రైతులు పాల్గొన్నారు.

# ఏఎంసీలో సందడే సందడి

- ఘనంగా శతాబ్ది ఉత్సవాలు
- పాల్గొన్న పూర్వ విద్యార్థులు



శతాబ్ది ఉత్సవాలకు హాజరైన ఏఎంసీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న మంత్రి విడదల రజని

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాలలో శుక్రవారం సందడి నెలకొంది. పూర్వ విద్యార్థులు, వైద్యులు, దేశ విదేశాల్లో స్థిరపడ్డ అనేక మంది ఆంధ్ర వైద్య కళాశాలకు తరలివచ్చారు. పూర్వ వైద్య విద్యార్థుల రాకతో ఒక్కసారిగా ఏఎంసీ ప్రాంగణం కళకళలాడింది. ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొడానికి వచ్చే వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు.

శుక్రవారం ఒక్కరోజే దాదాపు మూడు వేల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.ఆంధ్రా మెడికల్ కాలేజీ ఆవరణలోను, బీచ్ రోడ్డులో ఉన్న ఏయూ కాన్వొకేషన్ హాలులో కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం ఏర్పాట్లు చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, పీజీ చదవి దేశ, విదేశాల్లో స్థిరపడ్డ వైద్యులు, వైద్య విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.

సెంటినరీ సెలబ్రేషన్స్ సావనీర్‌ను మంత్రి విడదల రజిని విడుదల చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున, డీఎంఈ డీఎస్వీఎల్ నరసింహం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బాబ్జీ, మధ్యప్రదేశ్ ఆయుష్మాన్ భారత్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ ఇ.రమేష్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, సెకండరీ ఎడ్యుకేషన్ సంచాలకులు ఎస్. వేంకటేశ్వర్, ఎమ్మెల్సీ డాక్టర్ రవీంద్ర బాబు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, నార్త్ అమెరికా ప్రెసిడెంట్ మైనేని నాగేంద్ర, ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి. బుచ్చిరాజు,సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టి. రవిరాజు, అంకోసా ప్రెసిడెంట్ కె. శశిప్రభ, ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంధ్రా మెడికల్ కళాశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

**సెల్ఫీలు దిగిన పూర్వ విద్యార్థులు**

ఆంధ్రా మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థులు శుక్రవారం సెల్ఫీలు దిగారు. పూర్వ విద్యార్థులంతా కలిసి సెంటినరీ బ్లాక్, పైలాన్, ఇతర నిర్మాణాల వద్ద సెల్ఫీలు దిగారు.



ఏఎంసీ పైలాన్ వద్ద సెల్ఫీల సందడి

### ఏఎంసీ తల్లిలాంటిది



ఆంధ్రా మెడికల్ కళాశాల తల్లిలాంటి సంస్థ. 1986లో ఎంబీబీఎస్ ఇక్కడే చదువుకున్నా. చదువు పూర్తయిన తర్వాత అమెరికాలో ఉద్యోగం రావడంతో అక్కడే స్థిరపడ్డాను. చదువుకున్న సంస్థకు ఏదో విధంగా సాయం చేయాలని ఇక్కడ చదువున్నవాళ్లమంతా నిర్ణయించుకున్నాం. 1981 నుంచి నేటి వరకు కేజీహెచ్, ఏఎంసీలకు సుమారు రూ.50 కోట్లు సాయం అందించాం . కరోనా సమయంలో కేజీహెచ్‌కు అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్ పరికరాలు ఇచ్చాం. వైద్యపరంగా ఎలాంటి సాయాన్ని అయినా అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

– మైనేని నాగేంద్ర, అధ్యక్షుడు, ఆంధ్రా మెడికల్ కాలేజీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్- నార్త్ అమెరికా

### రుణం తీర్చుకుంటాం



వందేళ్లు పూర్తి చేసుకున్న ఏఎంసీలో వైద్య విద్యను అభ్యసించడం ఎంతో గర్వంగా ఉంది. ఆంధ్రా మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థిగా ఇప్పుడు శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. కళాశాల రుణం తీర్చుకోవడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నా. క్యాన్సర్ పరీక్షలకు అవసరమైన పరికరాల కోసం నిధులు ఇచ్చాం. ఇప్పుడు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి పూర్తి సహకారం అందిస్తున్నాం.

– చలసాని ప్రసాద్, పూర్వ అధ్యక్షుడు, అంకానా సంస్థ

## టేకు దుంగలు పట్టివేత



కలప రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్

అడ్డతీగల: అడ్డతీగల అటవీ రేంజి పరిధిలోని వీరవరం వద్ద ట్రాక్టర్‌లో రవాణాకు సిద్ధం చేసిన 24 టేకు దుంగలను అడ్డతీగల అటవీ రేంజి అధికారులు గురువారం రాత్రి సీజ్ చేశారు. వీటి విలువ రూ.70 వేలకు పైగా ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు. కలప అక్రమ రవాణాకు ఉపయోగించిన ట్రాక్టర్‌తో సహా కలపను అడ్డతీగల అటవీ కార్యాలయానికి తరలించారు.



## వైఎస్సార్‌సీపీలో 14 కుటుంబాల చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్

రాజవొమ్మంగి : మండలంలోని అమీనాబాద్ పంచాయతీలో వివిధ పార్టీలకు చెందిన 14 కుటుంబాలవారు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెట్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, సర్పంచ్ కించు వెంకటలక్ష్మి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రికార్డులు లేని మూడు ఆటోలు సీజ్



సీజ్‌చేసిన ఆటోలతో అనంతగిరి ఎస్‌ఐ కరక రాము

అనంతగిరి: రికార్డులులేని మూడు ఆటోలను సీజ్ చేసినట్లు అనంతగిరి ఎస్‌ఐ కరక రాము తెలిపారు. మండలంలోని డముకు–నిమ్మలపాడు రోడ్డులోని శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. ఆ సమయంలో వచ్చిన మూడు ఆటోలకు రికార్డులు, డ్రైవర్లకు లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ లేకపోవడంతో కేసు నమోదు చేసి, సీజ్ చేసినట్టు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ రాము విలేకరులతో మాట్లాడుతూ పరిమితికిమించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలు నడిపిన, రికార్డులు సక్రమంగా లేకపోయిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల వద్ద రికార్డులు, లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు.



# కారు, బైక్ ఢీ : నలుగురికి గాయాలు



గాయలతో పడిఉన్న తల్లీ పిల్లలు



చికిత్స చేయిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

డుంబ్రిగుడ: మండలంలోని అరకు–పాడేరు ప్రధాన రోడ్డులో కురిడి పంచాయతీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మైదాన ప్రాంతానికి చెందిన పర్యాటకులు చాపరాయి జలపాతాన్ని సందర్శించిన అనంతరం కారులో అరకు వైపు బయలుదేరారు. హుకుంపేట మండలం పెద్దగరువు పంచాయతీ మత్స్యపురం గ్రామానికి చెందిన కొర్రా కృష్ణారావు, ఆయన భార్య, ఇద్దరు పిల్లలు అరకు సంతబయలు నుంచి బైక్‌పై బయలుదేరారు. కారు, బైకు ఎదురెదురగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో బైకుపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు, వారి ఇద్దరి పిల్లలు గాయపడ్డారు. భార్యాభర్తలు తీవ్రంగా గాయపడగా, పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. 108 వాహనంలో క్షతగాత్రులను అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

**మానవత్వం చాటుకున్న డీఎంహెచ్‌వో :** అరకులోయలో స్పందన కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉన్న జిల్లా ఆరోగ్య వైద్యాధికారి జమాల్ బాషా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయడిన వారిని చూసి సహాయక చర్యలు చేపట్టారు. 108 వాహనానికి ఫోన్ చేసి, క్షతగాత్రులను అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారితో పాటు ఏరియా ఆస్పత్రికి వెళ్లి దగ్గరుండి చికిత్స చేయించారు.

**బంద వీధి వద్ద..**



బందవీధి వద్ద ప్రమాదానికి గురైన కారు, బైక్ (ఇన్‌సెట్) తీవ్రంగా గాయపడిన బాలుడు

జి.మాడుగుల: పాడేరు రోడ్డులో బందవీధి సమీపంలో మలుపు వద్ద శుక్రవారం బైకు, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జీకె వీధి మండలం గంధంపాడు గ్రామానికి చెందిన కిలో రాంబాబు, కిల్లో లక్ష్మి, నాలుగేళ్ల బాబుతో కలసి బైక్‌పై పాడేరు వైపు వెళుతుండగా, జి.మాడుగుల వైపు వస్తున్న కారు బందవీధి సమీపంలో మలుపు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో కిల్లో లక్ష్మి, బాబుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# వంద రోజుల పని కల్పించాలి

**ఐటీడీఏ పీవో కావూరి చైతన్య**

చింతూరు: ఉపాధి కూలీలందరికీ తప్పనిసరిగా వంద రోజుల పనిదినాలు కల్పించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. చింతూరు మండలం వీరాపురంలో శుక్రవారం ఆయన ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న ఊటకుంట పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపోడు పట్టాలు కలిగిన ఉపాధి కూలీలకు 150 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ అడిగిన వెంటనే పని కల్పిస్తున్నారా, లేదా, వేతనాలు సకాలంలో చెల్లిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో వుంటున్నారా అని ప్రశ్నించిన ఆయన అధికారులు అందుబాటులో లేకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడీ రోశయ్య, ఎంపీడీవో రవిబాబు, ఏపీవో రాజు పాల్గొన్నారు.

# కూళ్లపాడులో ఆర్‌అండ్‌ఆర్ అవార్డు ఎంక్వైరీ



అవార్డు ఎంక్వైరీ నిర్వహిస్తున్న అధికారులు

కూనవరం: పోలవరం ముంపు పరిధిలో ఉన్న కూళ్లపాడు గ్రామంలో ఎస్‌డీసీ సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం అర్‌అండ్‌ఆర్ అవార్డు ఎంక్వైరీ నిర్వహించారు. 150 కుటుంబాలకు చెందిన నిర్వాసితుల గృహాలకు సంబంధించిన వివరాలను గ్రామసభ ద్వారా సేకరించారు. ఇంటిపన్ను రశీదు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్ మీటర్ తదితర రశీదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌డీసీ సుబ్బారావు మాట్లాడుతూ ఒకే ఇంట్లో తండ్రీ కొడుకులు నివసిస్తూ ఉంటే అంటువంటి ఇంటి విలువ రెండు కుటుంబాలకు వర్తిస్తుందన్నారు. ఇద్దరూ చెరో పోర్షన్‌లో వేరు వేరుగా నివసిస్తూ ఇంటి పన్ను కలిగి ఉంటే పరిహారం ఇంటి మొత్తానికి కలిపి వర్తిస్తుందన్నారు. అలాగే భూమి విషయంలో పట్టాదారు మరణించి ఉంటే తప్పనిసరిగా ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్ అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, ఎంపీటీసీ మడకం నాగరాణి, కార్యదర్శి సురేష్, వీఆర్వో సుగుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, యూత్ కన్వీనర్ సోందె పాపారావు పాల్గొన్నారు.

# ఏడు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

సాక్షి,పాడేరు: పాడేరు ఎస్టీ నియోజకవర్గ పరిధిలో అదనంగా ఏడు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు సంయుక్త కలెక్టర్, నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె.శివశ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఓటర్లకు అందుబాటులో ఉండే విధంగా, ప్రస్తుతం ఉన్న దూరం తగ్గే విధంగా ఏర్పాటు చేసిన ఈ ఏడు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఆమోదించిందని జేసీ వివరించారు. పాడేరు మండలంలో వంట్లమామిడి పంచాయతీ కొత్తపాలెం, దేవపురం పంచాయతీ తుమ్మలపాలెం, సలుగు పంచాయతీ రెల్లమామిడి, చిలకలగొంది గ్రామాల్లో నాలుగుకొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. విధంగా జి.మాడుగుల మండలంలో లువ్వాసింగి పంచాయతీ అలగం, వంతాల పంచాయతీ డుమ్ములమామిడి గ్రామాల్లో రెండు, చింతపల్లి మండలంలో బలపం పంచాయతీ చెరువూరు గ్రామంలో ఒకటి కలిపి మొత్తం ఏడు కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జేసీ తెలిపారు.